## ఈటలకు ఆహ్వానపత్రిక అందజేత



ఈటలకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

**వర్గల్, సెప్టెంబర్ 19 (ప్రభాతవార్త):** ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యా సరస్వతి అమ్మవారి దేవాలయంలో ఈనెల 22వ తేదీ నుండి ప్రారంభం కానున్న శరన్నవరాత్ర మహోత్సవాల ఆహ్వాన పత్రికను ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌కు అందజేశారు. శరన్నవరాత్రి మహోత్సవాలకు తప్పకుండా హాజరవుతానని ఈటల రాజేందర్ తెలిపినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## నర్మెట ఆయిల్‌ఫాం కర్మాగారం ట్రయల్ రన్ విజయవంతం

**నంగునూర్, సెప్టెంబరు 19, (ప్రభాతవార్త) :** మండలపరిధిలోని నర్మెట గ్రామంలో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్‌ఫాం కర్మాగారం పనులు పూర్తికావడంతో శుక్రవారం ట్రయల్ రన్ నిర్వహించారు. ట్రయల్ రన్ విజయవంతం కావడంతో రైతులు,గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఆయిల్‌ఫాం కర్మాగారం గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఆర్థిక మంత్రి తన్నీరు హరీష్‌రావు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించిన విషయం తెలిసిందే!. నర్మెటలో ఆయిల్‌ఫాం కర్మాగారం నిర్మించడంతో జిల్లాలోని రైతులు ఆయిల్‌ఫాం పంటను సాగుచేయడానికి పెద్దఎత్తున్న ముందుకు వచ్చారు. ఆయిల్‌ఫాం కర్మాగారాన్ని త్వరలో సిఎం చేతులమీదుగా ప్రారంభించడానికి జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది. కాగా బిఆర్ఎస్ హయాం లో రైతుల సౌకర్యార్థం అంకురార్పణ జరిగిన ఆయిల్‌ఫాం కర్మాగారం పనులు పూర్తి చేసుకొని ట్రయల్ రన్ విజయవంతం కావడంతో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు సంతోషం వ్యక్తం చేశారు. త్వరలో ఆయిల్‌ఫాం కర్మాగారం అందుబాటులోకి వచ్చి రైతులకు లాభాలు ఇవ్వనుందని హరీష్‌రావు తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

## పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలి

### సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

**నంగునూర్, సెప్టెంబరు 19, (ప్రభాతవార్త :** మండల పరిధిలోని గట్ల మల్యాల గ్రామంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ శుక్రవారం సందర్శించారు.ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని పెండింగ్ పనులను టిఎస్ఎంఐడిసి ఈఈని అడిగి తెలుసుకున్నారు.పిహెచ్‌సి చుట్టూ గోడను అలాగే పెండింగ్ పనులను వారం రోజుల్లో ప్రారంభించి పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పెండింగ్ పనులను వారం రోజుల్లో ప్రారంభించకుంటే టెండర్‌ను రద్దు చేసి రీ టెండర్‌ను పిలుస్తామని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. కాగా పంచాయతీ కార్యదర్శి లలిత డబ్బులు ఇస్తేనే పనులు చేస్తుందని గ్రామానికి చెందిన పలువురు జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఆమె స్పందిస్తూ ఏదైనా సమస్య ఉంటే రాత పూర్వకంగా రాసి దరఖాస్తు ఇస్తే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## పిఎం ఆవాస్ యాప్ సర్వే పూర్తి చేయాలి

### మెదక్ జిల్లా పరిషత్ సిఇవో ఎల్లయ్య



ఎంపిడివో కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

**రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబరు 19, (ప్రభాతవార్త :** ప్రధానమంత్రి ఆవాస్ యాప్ సర్వే పూర్తి చేయాలని మెదక్ జిల్లా పరిషత్ సీఈవో ఎల్లయ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన రామాయంపేట మండల కేంద్రంలో పర్యటించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని స్థానిక ఎంపిడివో షాజొద్దీన్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరులోపు పీఎం ఆవాస్ యాప్ సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిరుపేద సొంతింటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.5 లక్షల నిధులు కేటాయిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## 21న చింతమడకకు కల్వకుంట్ల కవిత రాక

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 19, (ప్రభాతవార్త :** జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఈనెల 21న తన సొంత ఊరిలో నిర్వహించే ఎంగిలి పూల బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొననున్నారు. అలాగే 24న జిల్లాలోని వర్గల్ అమ్మవారిని దర్శించుకోనున్నారు.

## ప్లాస్టిక్ వాడవద్దని విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ

### మున్సిపల్ సిబ్బందికి వైద్య శిబిరం

**నర్సాపూర్ సెప్టెంబరు 19 ప్రభాతవార్త :** పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీ శ్రీ రామ్ చరణ్ రెడ్డి ఆదేశాల ప్రకారం స్వచతా.హి సేవా కార్యక్రమంలో భాగంగా ,ప్లాస్టిక్ వినియోగం వలన పర్యావరణానికి కలిగే అనర్థాలు, నివారణకు కావలసిన కార్యాచరణ, ప్రత్యామ్నాయ మార్గాలను వివరిస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని సంగారెడ్డి మెయిన్ రోడ్డు పరిధిలో చేత్తవేసే ప్రదేశాన్ని గుర్తించి అట్టి ప్రదేశాన్ని శుభ్రం చేయించి, మెప్మా సిబ్బంది ద్వారా ముగ్గులు వేయించి బ్యూటీ పికేషన్ చేయించడం జరిగింది . అదేవిధంగా మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బందికి హెల్త్ క్యాంప్ నిర్వహించి వైద్య చికిత్సలు చేయించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ మేనేజర్ సి వి మధుసూదన్, వైద్య శాఖ సిబ్బంది డాక్టర్ సాయి దీప్తి, డాక్టర్ సునీత, ఏఎన్‌ఎంలు రోజా రాణి బాలమని, ఆశ వర్కర్ల, సూపర్వైజర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సంగారెడ్డి అదనపు ఎస్పీగా రఘునందన్‌రావు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, సెప్టెంబరు 19 ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా సిహెచ్.రఘునందన్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మర్యాదపూర్వకంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రఘునందన్‌రావు 1995 బ్యాచ్ ఎస్ఐ. గతంలో తెలంగాణ పోలీస్ అకాడమీలో డిఎస్పీగా విధులు నిర్వహించారు. ఇటీవల అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది, సంగారెడ్డి జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్)గా బదిలీపైవచ్చి, బాధ్యతలు స్వీకరించారు.
గ్రంథాలయాలతో విద్యార్థులకు విజ్ఞానం పెంపొందుతుంది



జిల్లా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అదనపు ఎస్పీ

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త :** విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతో కూడిన ఆహారం అందించాలని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ కె.హైమావతి సిబ్బందిని హెచ్చరించారు. మండల పరిధిలోని ఇర్కోడ్ తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను శుక్రవారం సిద్దిపేటజిల్లా కలెక్టర్ హైమావతి ఆకస్మికంగా సందర్శించి భోజన ప్రక్రియను పరిశీలించారు. మెనూ ప్రకారం కాకుండా అన్నం, పప్పు చారు, గుడ్డు మాత్రమే వండినందుకు ఆమె అగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల, పాఠశాల అవరణలో ఖాళీ స్థలం ఉండడంతో కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేయాలని ప్రిన్సిపల్ రవీందర్‌ను ఆదేశించారు. పాఠశాలలో కుట్టుమిషన్ గదిని పరిశీలించి కుట్టు మిషన్ నైపుణ్యం ముఖ్యమని బాలికలకు శిక్షణ ఇవ్వాలని ట్రేని టీచర్‌ను ఆదేశించారు. అనంతరం ప్రాంగణంలోని ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించి భోజన ప్రక్రియను పరిశీలించారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని నాణ్యమైనా ఆహార పదార్థాలను వాడాలని కాలంచెల్లిన పదార్థాలు వినియోగించొద్దన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆమె వెంట హాస్టల్ వార్డెన్, సిబ్బంది ఉన్నారు.

### కలెక్టర్ పలు గ్రామాలలో పర్యటన...

**దుబ్బాక,(అక్బర్‌పేట భూంపల్లి), సెప్టెంబరు 19, ప్రభాతవార్త :** మండలంలోని రామక్కపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆకస్మికంగా సందర్శించి స్వస్థ్ నారి శక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలోభాగంగా పిహెచ్‌సి చేస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ప్రత్యేకమైన వైద్య నిపుణులచే జనరల్ మెడిసిన్, గైనకాలజిస్ట్, ఆప్తాలజిస్ట్, దంత వైద్యులు, చెవి, ముక్కు, గొంతు, చర్మ వ్యాధుల, మానసిక వైద్య నిపుణులు ద్వారా 14 రకాల ఆరోగ్యసేవలు అందిస్తారనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ప్రతి ఒక్క మహిళ ఆరోగ్యాన్ని పరీక్షించుకోవాలని సూచించారు. అలాగే ఆయా గ్రామాల ఏఎన్ఎం, ఆశాలు మీ గ్రామంలో మహిళలను ఈ కార్యక్రమానికి వచ్చేలా ప్రోత్సహించాలని తెలిపారు. అలాగే జిల్లా మొత్తం పిఎచ్‌సిలలో అక్టోబర్ 2 వరకు నిర్వహించే కార్యక్రమంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొని మీ ఆరోగ్యాన్ని బాగు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పిఎచ్‌సిలో అటెండెన్స్, ఓపి రిజిష్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఓపికగా మెరుగైన వైద్యం అందించాలని మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. మండలంలోని రామక్కపేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు 25 శాంక్షన్ కాగా 18 గ్రౌండింగ్ 7 ఇల్లు కట్టుకోడానికి సుముఖంగా లేమని లెటర్ ఇచ్చినట్లు అధికారులు కలెక్టర్‌కి తెలిపారు. బరిగే లక్ష్మి, ముత్తయ్య ఇతర నిర్మాణాలను పరిశీలించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇంటి నిర్మాణం చేసుకోవాలని ఎలాంటి సందేహాలు ఉన్న అధికారులకు తెలిపి పరిష్కారం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. పిఎమ్ఎవై యాప్‌లో అప్‌లోడ్ చేసిన ప్రక్రియ వేగవంతం చెయ్యాలనీ పంచాయతీ సెక్రటరీనీ ఆదేశించారు. దుబ్బాక మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్నీ జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఇందిరమ్మ ఇల్లు మండలంలో 395 శాంక్షన్ అయ్యాయని 301 మార్కింగ్ చేశామని ఎంపిడిఓ కలెక్టర్‌కి తెలిపారు. ఇల్లు కట్టుకోనివారి నుంచి లెటర్ తీసుకొని పేరు తొలగించాలని తెలిపారు. ఇంటి నిర్మాణంలో ఆయా గ్రామాల్లో రోజు వారి ప్రోగ్రెస్ కనిపించాలని ఇంటి నిర్మాణం పూర్తయ్యేవరకు పర్యవేక్షణ చెయ్యాలని, అలాగే పిఎమ్ ఎవై యాప్‌లో అప్‌లోడ్ ప్రక్రియ పక్కా ప్రణాళికతో పూర్తి చెయ్యాలని ఏంపిఓ నరేందర్‌రెడ్డిని ఆదేశించారు. అలాగే దుబ్బాక మున్సిపల్‌లో 346 శాంక్షన్ కిగాను 224 మార్కింగ్ అయ్యాయని అధికారులు తెలపగా ఇంటి నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమేష్‌ను ఆదేశించారు. మండలంలోని లచ్చపేట గ్రామంలోని ప్రభుత్వ స్థలాన్ని జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ స్థలంలో సర్వే నిర్వహించి చదును చెయ్యాలని హద్దులు పాతాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్ సంజీవ్, ఎంపీఓ నరేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్ తదితరులు ఉన్నారు.



గ్రంథాలయాన్ని ఉపయోగించుకని

## విద్యార్థులు విజ్ఞానవంతులు కావాలి

### కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

**నర్సాపూర్, సెప్టెంబరు19 ప్రభాతవార్త :** గ్రంథాలయాలతోనే విద్యార్థులకు విజ్ఞానం పెంపొందుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. శుక్ర వారం నర్సాపూర్ పట్టణ సమీపంలోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాలలోని గ్రంథాలయానికి 119 వివిధ రకాల పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నర్సాపూర్ లో మొట్టమొదటి రెసిడెన్షియల్ పాఠశాల ఇదేనని గుర్తు చేశారు. దూరదృష్టితో ఆలోచించి కీర్తిశేషులు దివంగత మాజీ ఎమ్మెల్యే విట్టల్‌రెడ్డి కృషితో ఈ గురుకుల కళాశాల,పాఠశాలను స్థాపించారన్నారు. ఇందులో చదివిన విద్యార్థులు ఎందరో ఉన్నత స్థాయికి చేరుకున్నారని చెప్పారు. విద్యార్థులు గ్రంథాలయాల్లోని విజ్ఞానం కలిగించే పుస్తకాలను చదివి ఉన్నత స్థాయికి చేరుకుంటారని వారు ఆకాంక్షించారు. దివంగత మాజీ ఎమ్మెల్యే చిలుముల విట్టల్‌రెడ్డి కృషితో స్థాపించిన ఈ పాఠశాలను చిరస్థాయిగా ఆయనను గుర్తుంచుకుంటారని అన్నారు. సమాజంలో మంచి పనిని చేసేవారిని ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు. ఈ కళాశాల పాఠశాలలోని గ్రంథాలయాన్ని విద్యార్థులు అందరూ ఉపయోగించుకొని విజ్ఞానవంతులు కావాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో చిలిపిచెడ్ మండల మాజీ జెడ్పిటిసి చిలుముల శేషసాయిరెడ్డి, శివంపేట సీనియర్ నాయకులు లక్ష్మీకాంతారావు, మాజీ ఎంపీపీ జ్యోతి సురేష్ నాయక్, నర్సాపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్, ప్రముఖ సంఘ సేవ అవార్డు గ్రహీత బండారు గంగాధర్, మండల మైనార్టీ అధ్యక్షులు చిన్న చిన్నం రెడ్డి,చంద్రం కృష్ణ గౌడ్, శ్రీనివాస్ గుప్తా,సావిత్రి రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాధాకృష్ణ గౌడ్, జంగం వెంకటేష్,రవి యాదవ్, శ్రీనివాస్ రెడ్డి,అబిస్తాన్, నాగేష్,రవి, సాయి చరణ్ గౌడ్,కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరాయ్, నాయకులు, కార్యకర్తలు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు

## ముగిసిన ఇమాజిన్ జపాన్ పెయింటింగ్ పోటీలు

### విజేతలకు బహుమతులు అందజేత

**నర్సాపూర్ సెప్టెంబరు 19 ప్రభాతవార్త :** పట్టణ సమీపంలోని బివి రాజు ఇంజనీరింగ్ కళాశాలలో ఇమాజిన్ జపాన్ పెయింటింగ్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. గ్రాడ్యుయేట్ స్టడీ అబ్రాడ్ సెంటర్, జపనీస్ భాషా విభాగం సంయుక్తంగా ఈ పోటీలు నిర్వహించాయి. ఈ పోటీల్లో మొత్తం 67 మంది విద్యార్థులు పాల్గొని జపాన్ సంస్కృతి సాంప్రదాయాలు, ఆవిష్కరణలు తమ కళాత్మక సృజనాత్మకతతో కాన్వాస్‌పై చిత్రించారు. ఈ కార్యక్రమానికి సాగా యూనివర్సిటీ జపాన్ ప్రొఫెసర్ డాక్టర్ యూకియో నాగానో, కురుమే నుంచి ప్రత్యేక ప్రొఫెసర్ డాక్టర్ షుచి టోరీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారి సమక్షంలో విద్యార్థులకు, అధ్యాపకులకు జపాన్ విద్యా సంబంధం అంశాలు సాంస్కృతిపై మరింత లోతైన అవగాహన కల్పించారు. ఇమాజిన్ జపాన్ పెయింటింగ్ పోటీలలో పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులలో జపాన్లోని ఉన్నత విద్యా సంస్కృతి సాంప్రదాయాలపై అవగాహన గౌరవం పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసి వారి కళా నైపుణ్యాన్ని గుర్తించారు. అనంతరం కళాశాల డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్ళినప్పుడు అక్కడ విద్య అవకాశాలు సాంస్కృతిక సంప్రదాయాలు తెలుసుకున్నప్పుడు విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలవకుండా ఉండేందుకు తమ కళాశాలలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. విశాల దృక్పథంతో శ్రీ విష్ణు విద్య సంస్థల చైర్మన్ శ్రీ కె.వి విష్ణురాజు ఉన్నతమైన ఆలోచనలకు ఈ కార్యక్రమం ఒక ఉదాహరణ అని అన్నారు. ఇమాజిన్ జపాన్ పెయింటింగ్ పోటీకి వచ్చిన స్పందన పట్ల మేము చాలా సంతోషిస్తున్నామని. ఈ కార్యక్రమంలో ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ప్రపంచ దృక్పాతాన్ని పెంచడానికి సాంస్కృతిక మార్పుడీని ప్రోత్సహించడానికి ముఖ్యమైనవని అన్నారు. విజేతలైన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో విష్ణు విద్యా సంస్థల డీన్ డాక్టర్ రాజు, ఎడ్ల జి ఎస్ ఏ సి శ్రీమతి కె ప్రణీత, జపనీస్ భాష ఉపాధ్యాయురాలు శ్రీమతి లావినా అరోరా, డిన్స్ ఫ్యాకల్టీ మెంబర్స్, వివిధ రాష్ట్రాల ప్రఖ్యాత యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థిని, విద్యార్థులు కళాశాల మేనేజర్ శ్రీ బాపిరాజు, ఏవో సురేష్ తదితరులు ఉన్నారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో సాగా యూనివర్సిటీ ప్రొఫెసర్లు

# యధేచ్ఛగా పన్నుల ఎగవేత

### నోటీసులిచ్చినా స్పందించని సోలార్ కంపెనీలు!

### సోలార్ కంపెనీల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్న కంపెనీల సిబ్బంది...!



సోలర్‌లో పంచాయతీ కార్యదర్శులను అడ్డుకుంటున్న దృశ్యం

**టేక్మాల్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలో ఉన్న సోలార్ కంపెనీలు ఎనిమిదేళ్లుగా పంచాయతీలకు పన్ను ఎగవేస్తున్న వైనంపై అధికారులు స్పందించారు.పన్నుల ఎగవేతకు సంబంధించిన వివరాలను రికార్డుల్లో సోలార్ ఎందుకు ఉంచలేదని, సోలార్ మంజూర్‌లో అంతులేని అవినీతి, రెవెన్యూ రికార్డుల్లో గందర గోళం అనే శీర్షికలతో వెలువడిన వార్త కథనాలకు అధికారుల్లో కదలిక వచ్చింది. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు టేక్మాల్ మండలపరిధిలోని టేక్మాల్, హసనమహ్మద్పల్లి, ఎల్లంపల్లి, అచ్చన్నపల్లి, మాల్కపూర్, పల్వంచ, కోరంపల్లి, ఎలకుర్తి, సాలోజిపల్లి, గ్రామాలలో ఉన్న పంచాయతీ కార్యదర్శులు సోలార్ ప్లాంట్లను సందర్శించి వారికి నోటీసులు అందజేసిన విషయం తెల్సిందే. సోలార్ అనుమతులు, కంపెనీలకు సంబంధించిన పత్రాలను అందజేయాలని పలుమార్లు నోటీస్‌లో పేర్కొన్నారు. తాము పన్ను కట్టేందుకు సిద్ధంగా ఉన్నామని గ్రామ కార్యదర్శులకు సోలార్ కంపెనీలకు నోటీస్ లేఖలు పంపింది. కాగా నోటీసులిచ్చి 8 నెలలు కావోస్తున్న ఉలుకు పలుకు లేక పోవడంతో పన్నుల చెల్లింపు విషయాన్ని తెలుసుకునేందుకుగాను శుక్రవారం టేక్మాల్ పంచాయతీ కార్యదర్శి రాకేష్, హసన్ మహ్మద్‌పల్లి కార్యదర్శి నాగరత్నంలు ఎల్లంపల్లి సోలార్ గేటు వద్దకు వెళ్లగా లోపలికి అనుమతి లేదని సిబ్బంది అడ్డుకున్నారు. ప్రభుత్వ అధికారులను ఎందుకు లోపలికి పంపరని సిబ్బందిని కార్యదర్శులు ప్రశ్నించారు.అనుమతి లేనిదే లోపలికి వెళ్ల కూడదని చెప్పారు. వారం పదిరోజుల్లో లీగల్ టీంతో వచ్చి ఇందుకు సంబంధించిన ట్యాక్స్‌ను చెల్లిస్తారు అంటూ సర్ది చెప్పి పంపించినట్లు కార్యదర్శులు చెప్పారు. మరో మారు నోటీసులిచ్చి పన్ను కట్టిస్తామన్నారు.

ఇంత బాహటంగా పంచాయతీలకు పన్ను కట్టకున్నా జిల్లా స్థాయి అధికారులు స్పందించకపోవడంపై పలు అనుమానాలు తలెత్తున్నాయని స్థానికులు అంటున్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న మహారాష్ట్ర అధికారులు

## తొగర్‌పల్లిని సందర్శించిన మహారాష్ట్ర అధికారులు

**కొండాపూర్, సెప్టెంబరు 19(ప్రభాతవార్త):** మండలం పరిధిలోని తొగర్‌పల్లి గ్రామ పంచాయతీని శుక్రవారం మహారాష్ట్ర, సోలాపూర్ జిల్లా నుండి 11 మంది అధికారుల బృందం గ్రామాన్ని విజిట్ చేసి డంపింగ్ యార్డ్, పల్లె ప్రకృతి వనం, నర్సరీని, పరిశీలించి మండల ప్రజా పరిషత్ కార్యాలయం సందర్శించి మండల పరిషత్ అధికారులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమయ్యారు. అనంతరం కొండాపూర్ గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద వేసిన సిసి రోడ్డు పనులు, ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ ఇన్‌చార్జి జి బాలరాజ్, ఏపీఓ పూజ, ప్లానిటేషన్ మేనేజర్ మణికుమార్, ఎంపీడీఓ వేణు గోపాల్, ఎంపీవో శ్రీనివాస్మ, డిఈ, ఏఈ, పిఆర్,ఏఈ హౌసింగ్ ఉపాధి హామీ అదనపు ప్రోగ్రాం అధికారి వీరప్ప సిబ్బంది పాల్గొన్నారు.

## గుండెపోటుతో బిజెపి నాయకుడు మృతి

**గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 19 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం జాలి గామ గ్రామానికి చెందిన బిజెపి సీనియర్ నాయకుడు బండారి బిక్షపతి శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. ఇతను ఆర్ఎస్ఎస్ లో పనిచేస్తూ గ్రామంలో శాఖ నిర్వహించడంతో పాటు బిజెపిలోనూ పనిచేశారు. విషయం తెలుసుకున్న బిజెపి గజ్వేల్ మండల నాయకులు తలాకొంత పోగుచేసుకొని బిక్షపతి అంత్యక్రియలను నిర్వహించారు. బిక్షపతి పార్థివదేహంపై బిజెపి జెండా కప్పి నివాళులర్పించారు. బిక్షపతి అంత్యక్రియల్లో గ్రామ ప్రజలు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, బిజెపి గజ్వేల్ మండల నాయకులు పాల్గొన్నారు.



చోరీ జరిగిన ఎల్లమ్మ దేవాలయాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

## జాలపల్లి ఎల్లమ్మ దేవాలయంలో చోరీ

**ధూళిమిట్ట, సెప్టెంబరు 19, ప్రభాతవార్త :** మండలంలోని జాలపల్లి గ్రామంలోగల ఎల్లమ్మ దేవాలయంలో చోరీ జరిగింది. గౌడ సంఘం సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం సభ్యులు ఎల్లమ్మ దేవాలయం వద్దకు వెళ్లి చూడటంతో ఆలయంలో చోరి జరినట్లు గమనించి పరిశీలించగా అమ్మవారి ముక్కుపుడక, పుస్తెలు, మెట్టెలు, బంగారంపాటు హుండీలోని నగదును దొంగిలించారు. బంగారం తులానికి పైగా ఉంటుందని, అలాగే నగదు రూ.15 వేల నుండి రూ. 20 వేల వరకు ఉండవచ్చన్నారు.వెంటనే పోలీసులకు సమాచారం అందించినట్లు చెప్పారు. పోలీసులు వెంటనే సంఘటన స్థలాని చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొట్టిన ఆటో

### మహిళ మృతి..మరో ముగ్గురి పరిస్థితి విషమం

**గుమ్మడిదల, సెప్టెంబరు 19 ప్రభాతవార్త :** రోడ్డు పక్కకు ఆగి ఉన్న భారీ వాహనాన్ని ఆటో ఢీకొని మహిళ దుర్మరణం చెందిన సంఘటన మంబాపూర్ ప్రయాణ ప్రాంగణ సమీపంలో జరిగింది.ఎస్సై లక్ష్మీకాంత్ రెడ్డి కథనం ప్రకారం... గురువారం రాత్రి మెదక్ హైదరాబాద్ జాతీయ రహదారిపై మంబాపూర్ ప్రయాణ ప్రాంగణసమీపంలోని ఓ పరిశ్రమకు దగ్గరలో భారీ వాహనాన్ని నిలిపి ఉంచారు. గుమ్మడిదలలో గురువారం సంత ముగించుకొని ఇళ్లకు నల్లవల్లి గ్రామానికి వెళ్తున్న ప్రయాణికుల ఆటో ఎదురుగా ఉన్న భారీ వాహనాన్ని చూడకుండా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన తలారి ఇందిర(42) ప్రమాద స్థలంలోనే మృతి చెందింది. జిన్నారం పురపాలిక పరిధిలోని అందూర్ గ్రామానికి చెందిన యాదగిరి తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితి విషమంగా ఉంది. ఆటో డ్రైవర్ శేషయ్యతో పాటు మరో ఆరుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను బొంతపల్లి, గుమ్మడిదల ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్సలు అందిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## విద్యుత్‌షాక్‌తో పాడి గేదె మృతి



మృతి చెందిన పాడి గేదే

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 19,ప్రభాతవార్త :** సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామంలో విద్యుత్‌షాక్‌తో పాడి గేదె మృత్యువాత పడిన సంఘటన శుక్రవారం జరిగింది. అదే గ్రామానికి చెందిన సోమవారపు రాజయ్యకు చెందిన పాడిగేదె దమ్మచెరువులో నీరు తాగడానికి వెళ్లగా అప్పటికే చెరువు సమీపంలో విద్యుత్ తీగలు పడి ఉండడంతో షాక్ తగిలి మృత్యువాత పడినట్లు గ్రామస్తులు, బాధితుడు తెలిపారు. రూ. 90 వేల నష్టం జరిగినట్లు తెలిపారు.

## నాచారం వాగులో తేలిన మృతదేహం

**వర్గల్, సెప్టెంబరు 19 (ప్రభాతవార్త):** మతిస్థిమితం సరిగాలేని యువకుని మృతదేహం శుక్రవారం నాచారంవాగులో తేలింది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కథనం ప్రకారం... మానసిక పరిస్థితి సరిగాలేని హుస్సైన్(18)ను తండ్రి నరసప్ప 2016 సంవత్సరంలో శామీర్‌పేటలోని క్రిస్టోస్ బాయ్స్ ఆశ్రమ్‌లో చేర్పించగా మూడు నెలల క్రితం ఆశ్రమ్‌వారు వారికి చెందిన గజ్వేల్ మండలం మక్తమాసాన్‌పల్లిలో ఉన్న మరో ఆశ్రమ్‌కు హుస్సైన్‌ను తరలించారు. ఈనెల 14న మధ్యాహ్నం హుస్సైన్ ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోగా ఆశ్రమ్ నిర్వాహకులు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం నాచారం వాగులో శవమై కనిపించగా ఆశ్రమ్‌కు చెందిన రుశీల్‌నాయర్ మృతదేహం హుస్సైన్‌దిగా గుర్తించారు. మతిస్థిమితం సరిగాలేక ప్రమాదవశాత్తు నీటిలో పడి చనిపోయి ఉండవచ్చని క్రిస్టోస్ బాయ్స్ ఆశ్రమ్‌కి చెందిన రుశీల్‌నాయర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## శేరిదామర్‌గిద్దలో హెల్ క్యాంప్ సక్సెస్

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని శేరిదామర్‌గిద్దలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు పల్లె దవాఖానా డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శిబిరానికి చేరుకున్న ప్రజలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను సరఫరా చేశామన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సునీత, నవీన, ఆశా వర్కర్ లక్ష్మీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు నేత కత్తే శివకుమార్, శేరికర్ శరణప్ప, డీలర్ చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**-ఆర్డీవో పాండు**

**జోగిపేట, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వం అందచేస్తున్న సంక్షేమ పథకాలు అందచేయటం జరుగుతుందని ఆందోల్ ఆర్డీవో పాండు అన్నారు. శుక్రవారం నాడు ఆందోల్ తాహసీల్దార్ కార్యాలయం లో నిర్వహించిన రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డుల అందచేసే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, అందుకని ఇంకా రాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. జోగిపేట మార్కెట్ కమిటి చైర్మెన్ ఎం. జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం నిరుపేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. అనంతరం 22 మందికి కల్యాణ లక్ష్మి చెక్కులను అందచేశారు. 1121 కొత్త రేషన్ కార్డులు మండలంలో ఇప్పటి వరకు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ ఎస్. జగన్మోహన్ రెడ్డి, తహశీల్దార్ మధుకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శివరాజ్, జోగిపేట మాజీ కౌన్సిలర్లు రంగ సురేష్ గుప్తా, సురేందర్‌గౌడ్, మండలంలోని పలుగ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**నారాయణఖేడ్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ వాసవిక్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోటగిరి సాయిబాబా వాసవీ సెక్రటరీగా అర్ధం రమేష్ కుమార్, కోశాధికారిగా దారం మహేష్‌ను ఎన్నుకున్నారు. కొత్త కార్యవర్గం ద్వారా వాసవీ క్లబ్ సేవలు మన ప్రాంతంలో మరింత విస్తృతపరుస్తామని ఈసందర్భంగా అధ్యక్షుడు కోటగిరి సాయిబాబా తెలిపారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**పెద్దశంకరంపేట, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
పెద్ద శంకరంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మండలపరిధిలోని 25మంది ఉత్తమ ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి వెంకటేశం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి మొమెంటోలను అందజేశారు. జిల్లాస్థాయిలో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులకు, ఎంఆర్‌సి సిబ్బందిని ఎంఈఓ వెంకటేశం సన్మానించారు. కార్యక్రమంలో ఆయా ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, అధికసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సమైక్య సభ్యులు

**సదాశివపేట, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
సదాశివపేట 8వ వార్డు సమైక్య మహిళాసభ్యులు తమ సమస్యలు పరిష్కరించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ని కలిశారు. తమ సమస్యలతో కూడిన వినతిపత్రం ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణకార్యదర్శి వీరేశం, సమైక్య మహిళాసభ్యులు ఉన్నారు.

## పంటల సాగులో మెళకువలు పాటించాలి

**జోగిపేట, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
శుక్రవారం అందోలు మండలం సంగుపేట్ గ్రామములో గల రైతువేదికలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమం తెలంగాణ రైతువిజ్ఞాన కేంద్రం, ఇఫ్కోవారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డా.రవీందర్‌నాయక్ రైతులను ఉద్దేశించి సాగులో మెళకువలు, ప్రస్తుత యాజమాన్య పద్ధతులు క్లుప్తంగా వివరించారు. వ్యవసాయ విద్యార్థులు నిర్వహించిన వివిధ వ్యవసాయ నమూనా ప్రదర్శనలు రైతులందరూ శాస్త్రవేత్తల, ఇఫ్కో ఆధ్వర్యంలో వీక్షించడం జరిగింది. వ్యవసాయ శాస్త్రవేత్తలు డా.కె.అరుణ, డా.నిర్మల, కె.రాహుల్ విశ్వకర్మ వరి, ప్రత్తి, కంది, మొక్కజొన్న, కూరగాయల పంటల యాజమాన్యంలో చేపట్టాల్సిన సాగు మెళకువలు గురించి సవివరంగా తెలియజేశారు. సహాయ వ్యవసాయసంచాలకులు రమాదేవి మాట్లాడుతూ పురుగుమందుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రతలగురించి వివరించారు. అనంతరం ఇఫ్కో ఆధ్వర్యంలో రైతులకు వేపమొక్కలు పంపిణీచేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు, ఆయాగ్రామ రైతులు, యంగ్ ప్రొఫెషనల్స్ రేఖామనోజ్, యస్.శ్రీకాంత్, కె.ఆకాష్, పాల్గొన్నారు.

## విజయరామరాజు సేవలు చిరస్మరణీయం

**-మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**పెద్దశంకరంపేట, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
పెద్దశంకరంపేట మాజీ జెడ్పీటీసి దివంగత విజయరామరాజు చేసిన సేవలు చిరస్మరణీయమని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మల్కాపూర్‌లో శుక్రవారం దివంగత మాజీ జెడ్పీటిసి విజయరామరాజు ప్రథమవర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్‌పార్టీ కోసం విజయరామరాజు ఎంతగానో కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. మలి విడత తెలంగాణ ఉద్యమంలో ఆయనసేవలు వెలకట్టలేవని పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో ముందుండి మండలంలో ఎన్నో కార్యక్రమాలను చేపట్టారన్నారు. గ్రామీణ స్థాయి నుండి బిఆర్ఎస్ పార్టీని బలోపేతం చేశారని ఆయనచేసిన సేవలు గురించి గుర్తుచేసుకున్నారు. విజయరామరాజు మృతి బిఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అని అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపి జంగం శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపిపి లక్ష్మీ మరమేష్, మాజీ ఎంపిటిసిలు దత్తు దామోదర్, నాయకులు సుభాష్, శంకర్‌గౌడ్, రవీందర్, అశోక్, అంజయ్య, లక్ష్మయ్య, భూత్కూరి లింగయ్య, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాల మరమ్మతులకు రూ.16లక్షలు

**-పాఠశాలను పరిశీలించిన మండల ప్రత్యేక అధికారి**

**చౌటకూరు, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని బొమ్మారెడ్డిగూడెం గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలను, అంగన్‌వాడి కేంద్రాన్ని, డీఎస్టీ పాఠశాలలను మండల ప్రత్యేక అధికారి వసంత కుమారి శుక్రవారం సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేవంటే తరుచూ విద్యార్థులు ఆందోళన చేస్తున్న దరిమిలా మండల ప్రత్యేక అధికారి పాఠశాలను సందర్శించి పరిసరాలను ప్రత్యేకంగా పరిశీలించారు. పాఠశాల అభివృద్ధికి16లక్షల రూపాయలను మంజూరు అయినట్లు వసంత కుమారి వివరించారు. పాఠశాలలో మౌలిక సదుపాయలు కల్పిస్తామని విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అసవరం లేదని విద్యార్థులకు నచ్చచెప్పారు. ఇటీవల ముగిసిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీల్లో కబడ్డీ పోటీల్లో పాల్గొని ప్రథమ బహుమతిని అందుకున్న విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రత్యేక అధికారి వెంట ఎంపిడిఓ శంకర్,ఎంఈఓ అనురాధ, వసతి గృహం మెట్రిన్ భవానీ, ఉపాధ్యాయులు భబియా నాయక్, సురేందర్ తదితరులు ఉన్నారు.



బొమ్మారెడ్డిగూడెం గిరిజన ఆశ్రమపాఠశాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారిణి వసంతకుమారి

# ఎస్ఐఆర్-2025ను సమర్ధవంతంగా అమలు చేయాలి

**-రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి**
**-జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ పనులు చురుకుగా సాగుతున్నాయి**
**జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య**




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)2025ను పకడ్బందీగా చేపట్టేందుకు అన్ని జిల్లాలలో అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లతో, రెవెన్యూ అధికారులు తహసీల్దార్లతో మాట్లాడారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు 2002-2025 ఓటర్ల జాబితాల ఆధారంగా డేటాను నాలుగు కేటగిరీలుగా విభజించి, ఈనెల 24 లోపు నివేదికలను నియోజకవర్గాలుగా వారీగా సమర్పించాలని సూచించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలో ఎస్ఐఆర్2025 కోసం డేటా సేకరణ పనులు వేగంగా జరుగుతున్నాయని, కంట్రోల్ మ్యాపింగ్ ఆధారంగా కేటగిరీల వారీగా నివేదికలు సిద్ధం చేసి గడువులోపు సమర్పించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ పి.ప్రావీణ్య జిల్లాలోని ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో ఎస్ఐఆర్ 2025 మ్యాపింగ్ పనులపై సమీక్ష జరిపారు. 2002 నుండి 2025 వరకు 4కేటగిరీలుగా ఓటర్ల జాబితా మ్యాపింగ్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ రిటర్నింగ్ అధికారులను, సహాయరిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. కేటగిరీ ఎ: 2002, 2025 ఓటర్ల జాబితాలలో రెండింటిలోనూ పేర్లు ఉన్నవారు. కేటగిరీ బి: 2002లో పేరు లేకుండా, 01.07.1987 కంటే ముందు జన్మించినవారు. కేటగిరీ సి: 1987 నుండి 2004 మధ్య జన్మించినవారు. కేటగిరీ డి: 2004 తరువాత జన్మించినవారు (18-21 ఏళ్లు). సిఈఓ ఆదేశాల ప్రకారం, ప్రతి నియోజకవర్గం వారీగా ఓటర్ల సంఖ్య కేటగిరీల వారీగా లెక్కలతో సరిపోవాలి అన్నారు. ఉదాహరణకు: ఓ పోలింగ్ స్టేషన్‌లో 1500 ఓటర్లు ఉన్నట్లయితే, వారిని ఎ,బి,సి,డి కేటగిరీల్లో విభజించిన మొత్తం 1500కే సమానం కావాలి అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి, మైనారిటీ సంక్షేమశాఖ అధికారి, జహీరాబాద్ ఆర్‌డిఓ దేవుజా, అందోల్ ఆర్‌డిఓ పాండు, తహసీల్దార్లు, ఎన్నికల విభాగ అధికారులు పాల్గొన్నారు.

# డీఫాల్ట్ మిల్లర్ల ఆస్తులు జప్తు

**-అదనపు కలెక్టర్ మాధురి**
**-సిఎంఆర్ పూర్తిచేయని మిల్లర్లపై రెవెన్యూ రికవరీ**


**సంగారెడ్డి మున్సిపాలిటీ సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
జిల్లాలో సిఎంఆర్ అందించడంలో విఫలమైన డీఫాల్ట్ రైస్ మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్ట్‌ను అమలుచేసి ఆస్తులు జప్తు చేయాలని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి పౌర సరఫరాలశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి సిఎంఆర్ (కస్టమ్ బిల్లింగ్ రైస్) సరఫరాలపై పౌరసరఫరాలశాఖ అధికారులు, డిప్యూటీ తహసీల్దార్‌లు, రైస్‌మిల్లర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాధురి మాట్లాడారు. జిల్లాలో సిఎంఆర్ అందించడంలో విఫలమైన డీఫాల్ట్ రైస్ మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్ట్‌ను కఠినంగా అమలు చేయాలని పౌర సరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్లకు అదనపు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో పౌర సరఫరాలశాఖ జిల్లా మేనేజర్ అంబదాస్ రాజేశ్వర్, డిసిఎస్ఓ బాలసరోజ, పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దారులు జిల్లాలోని రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మాధురి

# కారెక్కిన కాంగ్రెస్ నాయకులు

**-పార్టీ కండువాలు కప్పిన ఎమ్మెల్యే**



ఎమ్మెల్యే సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

**జహీరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
ఝరాసంగం మండల పరిధిలోని జొన్నగామ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ బోయిని బక్కయ్య, నర్సింలు, లక్ష్మరెడ్డి, నరసింహారెడ్డి, వెంకటేశంలు తమ అనుచరులతో శుక్రవారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు ఎమ్మెల్యే బిఆర్ఎస్ ఖండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జహీరాబాద్ మండల బిఆర్ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ, పాక్స్ చైర్మన్ మచ్చేందర్, మాజీ అధ్యక్షులు సంగమేశ్వర్, మాజీ సర్పంచ్ కృష్ణా ఎల్లయ్య, పార్టీ అధ్యక్షులు వీరన్న పటేల్‌మల్లికార్జున్‌పటేల్, శివకుమార్ పటేల్, సంగమేశ్ సుభాష్, అంజన్న, విఠల్, నగేష్ గౌడ్, బి నగేష్, మాజీ సర్పంచ్‌లు బస్వరాజ్‌పటేల్, శ్రీనివాస్‌రెడ్డి, వశివర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆమనగల్లులో ముస్లింల నిరసనలు

**ఆమనగల్లు, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్‌లో ముస్లిం యువకులపై అక్కడి ప్రభుత్వం అప్రజాస్వామికంగా కేసులు నమోదు చేసిందని, దానికి ఖండనగా నిరసన వ్యక్తంచేస్తున్నట్లు జామామసీదు కమిటీ అధ్యక్షుడు ఎండి.మాసూమ్ అన్నారు. మహ్మద్ ప్రవక్త పేరుతో బోర్డు ఏర్పాటుచేస్తే ముస్లిం యువకులపై అక్కడి ప్రభుత్వం కేసులుపెట్టిందని మండిపడ్డారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం నవజవన్ కమిటీ ఇన్చార్జ్ అహ్మద్ సారథ్యంలో జామామసీదు ఆవరణలో ప్రత్యేకప్రార్థనల అనంతరం ముస్లింలు నిరసనవ్యక్తంచేస్తూ యుపిప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. జామియా మస్జిద్ అధ్యక్షులు మాసుమ్ మైనార్టీ నాయకులు, కమిటీసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పాముకాటుతో యువకుడి మృతి

**పెద్దేముల్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
పాముకాటుకు ఓ యువకుడు బలైన సంఘటన పెద్దేముల్ మండలం జనగాం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం..జనగాం గ్రామానికి చెందిన బిల్లిపురం శివకుమార్ (16) పాముకాటుకు గురై మృతిచెందాడు. తన తండ్రి చిన్నమల్లప్ప పాలవ్యాపారంచేస్తూ జీవనంకొనసాగిస్తున్నాడు, రోజు మాదిరిగానే శివకుమార్ గేదెలనుమేపడానికి పొలానికివెళ్ళాడు. గేదెలను మేపుతుండగా పొలంలో శివకుమార్‌ను పాముకాటువేసింది. దీంతో తనఫోన్‌ద్వారా కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వగా వారు తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యచికిత్స కోసం హైద్రాబాద్ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్ళారు. మూడురోజులుగా మృత్యువుతో పోరాడిన శివకుమార్ శుక్రవారం తుదిశ్వాస విడిచాడు.

## ముగిసిన కబడ్డీ పోటీలు




మాట్లాడుతున్న డిఎస్పీ సైదానాయక్

**జహీరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
రంజోల్‌లోని శ్రీసంగమేశ్వర పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన 69వ స్కూల్ ఫెడరేషన్ క్రీడాపోటీలు ఉత్సాహభరితంగా ముగిశాయి. అండర్ 17లో విన్నర్ జహీరాబాద్, రన్నర్ రాయికోడ్‌గా నిలిచారు. అదేవిధంగా అండర్ 14లో విన్నర్ గుమ్మడిదల, రన్నర్‌గా హత్నూర జట్టులు నిలిచాయి. గెలుపొందిన వారు జహీరాబాద్ డిఎస్పీ సైదానాయక్ చేతుల మీదుగా బహుమతులతోపాటు మొమెంటోలను అందించారు. ఎస్‌జిఎఫ్ జిల్లా సెక్రెటరీ శ్రీనివాస్‌రావు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్‌గౌడ్, యువజన నాయకులు ఉదయ్‌శంకర్‌పాటిల్, బాబి, వంశి, ప్రేమ్‌సింగ్‌రాథోడ్, శీనునాయక్, పిఆర్వోలు సతీష్‌గౌడ్, జైరాజ్, అమృత్, రాజ్‌కుమార్, ప్రశాంత్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు

**జిల్లేడుచౌదరిగూడెం, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
ఎన్నో సంవత్సరాల కల సాకారం అయినందున గ్రామస్థులు ఎంతో సంతోషాన్ని వ్యక్తంచేశారు. జిల్లెడుచౌదరిగూడ మండలంలోని రావిర్యాల గ్రామానికి వెళ్లే మార్గం మధ్యలోగల వాగు వలన వర్షాకాలంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారు. గత కొన్నిసంవత్సరాల నుంచి వంతెన నిర్మాణం చేపట్టాలని వేడుకున్నా, ఎవ్వరు పట్టించుకోలేదు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో సమస్యను వెళ్లబుచ్చుకున్నారు రావిర్యాల గ్రామస్థులు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే వంతెననిర్మాణం కోసం రూ.3.50లక్షల నిధులు మంజురు చేశారు. నిధులు మంజూరుచేసిన షాదనగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు చలివేంద్రపల్లి రాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా గ్రామంలో పాఠశాలభవనం, వంతెనతోపాటు సిసి రోడ్లు, డ్రైనేజీల కోసం నిధులు మంజూరు చేసినందుకు గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టి గ్రామ అధ్యక్షుడు శివకుమార్, నాయకులు సుధాకర్‌రెడ్డి, వీరన్న, నీలయ్య, బాస్కర్, కృష్ణయ్య, రామకృష్ణ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కమిషనర్‌కు సిపిఎం ఆధ్వర్యంలో వినతి

**ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
పోచారం మున్సిపల్ రాజీవ్ గృహకల్ప కాలనీ ప్రధాన చౌరాస్తాలో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న ప్రహరీగోడను తొలగించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నిత్యానందను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు చింతల యాదయ్య ఆధ్వర్యంలో కమిషనర్‌ను కలిసి కాలనీ సమస్యలపై విన్నవించినట్లు తెలిపారు. కాలనీ ప్రధాన చౌరాస్తాలోని గాంధీ, అంబేద్కర్ విగ్రహాలచుట్టూ ప్రహరీగోడ ఉండటంతో బస్సులు, ఆటోలు, ఇతరత్రా వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది అవుతుందని మెజారిటీ ప్రజల అభిప్రాయం మేరకు విగ్రహాల చుట్టూ ఉన్న ఫెన్సింగ్, ప్రహరీగోడను తొలగించి రోడ్డు వెడల్పు చేయాలని సిపిఎం నాయకులు కమిషనర్‌ను కలిసి విజ్ఞప్తిచేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి ఎన్.సబిత, జి.నాగమణి తదితరులున్నారు.

## అంగన్వాడీ టీచర్ల ముందస్తు అరెస్ట్

**కేశంపేట, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
కేశంపేట మండల కేంద్రంలో అంగన్వాడీ టీచర్లు ధర్నా చేపట్టనున్నారని సమాచారం అందిన నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టి, కొందరు అంగన్వాడీ టీచర్లను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు, ఈసందర్భంగా అంగన్వాడీ టీచర్లు మాట్లాడుతూ, మేము ఎలాంటి ధర్నాలో పాల్గొనే ఉద్దేశ్యం లేదు. మాకు ఎటువంటి ధర్నా కార్యక్రమంపై సమాచారం లేదు అని స్పష్టం చేశారు. పోలీసులు చట్టపరమైన శాంతిభద్రతల దృష్ట్యా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

## అన్నోజిగూడలో స్వచ్ఛ భారత్

**ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
బిజెపి రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు సేవాపక్షంలో భాగంగా పోచారం మున్సిపల్ పార్టీ ఆధ్వర్యంలో అన్నోజిగూడ లక్ష్మీనర్సింహ కాలనీలో శుక్రవారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు నానావత్ సురేశ్‌నాయక్ ఆధ్వర్యంలో లక్ష్మీనర్సింహకాలనీలో అక్కడక్కడ ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో బిజెపి జాతీయ గిరిజనమోర్చా కార్యవర్గ సభ్యుడు నానావత్ బిక్కునాయక్, రాష్ట్ర స్వచ్ఛభారత్ కన్వీనర్ సుజాతనాయుడు, మాజీ కౌన్సిలర్ గొంగళ్ల మహేశ్‌కురుమ, జిల్లా స్వచ్ఛ భారత్ కన్వీనర్ గొంగళ్ల రాజారమేశ్, డిటి నాయక్, పార్టీ నాయకులు గిరి, కోన మల్లేశ్, రేతి వెంకటేశ్, గంజీ వంశీకుమార్ పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**షాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే, రోగాలు ప్రబలకుండా ఉంటాయని షాబాద్ ఎంపిడివో అపర్ణ అన్నారు. షాబాద్ మండల కేంద్రంలో శుక్రవారం స్వచ్ఛతా హి సేవ 2025 కార్యక్రమాన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థులతో కలిసి నిర్వహించారు. ఈసందర్భంగా కెజిబివి, బాలుర ఉన్నతపాఠశాలలో మొక్కలునాటి, విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి, మానవహారం, స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. అలాగే బిజెపి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి పరిసరాల్లో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎపిఓ వీరాసింగ్, ఇన్చార్జి హెచ్‌ఎం బాలరాజ్, ఈసీ, ఉపాధ్యాయులు సుశీల, గ్రామకార్యదర్శులు, ఆశావర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది, బిజెపి మండలపార్టీ అధ్యక్షుడు మానయ్య, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు కిరణ్, స్వచ్ఛ భారత్‌సెల్ కన్వీనర్ రాము, మండల ప్రధానకార్యదర్శి హరీష్, విజయ్, సురేష్, కుమార్, రవి, శ్రీశైలం, అరుణ్, రాఘవేందర్ పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా ఒకరు మృతి నలుగురికి గాయాలు..

**తలకొండపల్లి, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
తలకొండపల్లి మండల పరిధిలోని మాదాయ పల్లి గ్రామ శివారులో ట్రాక్టర్ బోల్తా పడి ఒక వ్యక్తి మృతిచెంది నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. అందుకు సంబంధించి స్థానిక ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని కొట్రగ్రామానికి చెందిన దుద్దుకూరు జంగయ్య(50) అనే వ్యక్తి గత రెండునెలలుగా సిమెంట్ ఇటుకలు తయారు చేసేందుకు పనులకు వెళ్తుండేవాడు. శుక్రవారం ఉదయం సిమెంట్ ఇటుకల లోడుతో ట్రాక్టర్‌పై జంగయ్యతోపాటు మరో నలుగురితోకలిసి రంగారెడ్డిజిల్లా తలకొండపల్లి మండలం మాదాయపల్లి గ్రామానికి వస్తుండగా శివారులో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. దాంతో అందులోఉన్న జంగయ్య తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే ఆయన మృతిచెందాడు. ట్రాక్టర్‌లో ఉన్న నలుగురు తీవ్రగాయాలకు గురయ్యారు. అనంతరం మృతుని కుమారుడు రాములు ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

## మహిళలకు క్యాన్సర్‌వ్యాధిపై అవగాహన ఉండాలి

**షాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
మహిళలు, గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లల తల్లులు తమ ఆరోగ్యంపైన అవగాహన కలిగి ఉండాలని వెల్స్పన్ ఫౌండేషన్ సిఎస్ఆర్ హెడ్ కె.సురేఖ అన్నారు. శుక్రవారం షాబాద్ మండలపరిధిలోని నాగర్‌గూడ, హైతాబాద్, చందనవెల్లి, ముద్దెంగూడ గ్రామాల్లోని మహిళలకు, గర్భిణీస్త్రీలకు, చిన్నపిల్లల తల్లులకు ఆరోగ్యంపైన అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.

## 29న బతుకమ్మ-2న దసరా పండగలు

-కార్పొరేటర్, ఆలయ కమిటీ బాధ్యులు



పండుగతేదీలను ఖరారుచేస్తున్న కార్పొరేటర్, ఆలయకమిటీ బాధ్యులు

**రామచంద్రాపురం, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
ఈ నెల 29న బతుకమ్మ, అక్టోబరు 2న దసరా, జమ్మిపూజ, రావణ దహనకాండ కార్యక్రమాలు జరుపుకోవాలని శుక్రవారం తీర్మానించారు. రామచంద్రాపురం డివిజన్‌పరిధిలోని మందుముల శ్రీనివాస్‌నగర్ కాలనీలో కొలువున్న శ్రీఆంజనేయస్వామి ఆలయలో కార్పొరేటర్, జిహెచ్ ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్, ఆలయకమిటీ అధ్యక్షులు లక్ష్మన్, పురోహితులు బాలకృష్ణపంతులు ఆయా కులసంఘాల బాధ్యులతోకలిసి ప్రత్యేకంగా సమావేశం అయి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి పండగతేదీలను ఖరారుచేసి ప్రకటించారు. 29న సాయంత్రం 5.30గంటలకు బతుకమ్మ, అక్టోబరు 2న సాయంత్రం 5.35 గంటలకు దసరా, జమ్మిపూజ, రావణ దహనకాండ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## రామాలయం ఆవరణలో స్వచ్ఛభారత్

-పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి

**రామచంద్రాపురం, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
భారతీనగర్ డివిజన్ పరిధిలోని రామాలయం ఆవరణలో శుక్రవారం బిజెపి ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించి, పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరి అంజిరెడ్డి, భారతీనగర్ డివిజన్ అధ్యక్షులు రజినిశరత్, డివిజన్ మాజీ అధ్యక్షులు నందారెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి నారాయణ, రంగారెడ్డి జిల్లా జిఎస్ మైపాల్‌రెడ్డి, కృష్ణమూర్తి, శ్రీనివాస్, సునంద, అనిత, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో కనీస సౌకర్యాలు కరువు

-బిజెపి జిల్లా కార్యదర్శి అరుణ్‌రాజ్ శేరికార్



విలేకరులతో మాట్లాడుతున్న బిజెపి జిల్లా కార్యదర్శి అరుణ్‌రాజ్ శేరికార్

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
మండలంలోని మోడల్ స్కూల్‌లో కనీస సౌకర్యాలు సమకూర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని బిజెపి జిల్లా కార్యదర్శి అరుణ్‌రాజ్ శేరికార్ ఆందోళన వ్యక్తంచేశారు. శుక్రవారం అరుణ్‌రాజ్ శేరికార్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత 10రోజులుగా పాఠశాలకు తాగునీరు సరఫరా కాకపోవడంతో విద్యార్థినులు స్నానాలు చేసుకునేందుకు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. పాఠశాలకు నీరు సరఫరాకాకపోవడంతో వర్షపునీటితో స్నానాలు ఆచరించామని విద్యార్థినులు పేర్కొనడం చూస్తుంటే అధికారులతీరుపై ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన పనిలేదని విస్మయం వ్యక్తంచేశారు. ఇటీవల పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ అయినవిషయం విదితమేనని, తిరిగి భోజనంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం విద్యార్థులు బాగోగులు పట్టించుకుని కనీస సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వం స్పందించకుంటే బిజెపి ఆధ్వర్యంలో ధర్నా చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు రాజశేఖర్‌పాటిల్, యువ అధ్యక్షులు రమేష్, నాయకులు నాగశెట్టి పాటిల్, నరేష్ చాప్టే తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్ర స్థాయిలో పరిశీలించి భూములు కొనండి

-మాయమాటలు నమ్మి మోసపోవద్దు
-ఎస్ఐ మహేష్ సూచన

**సిర్గాపూర్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని వ్యవసాయ భూములు కొనేముందు మధ్య దళారుల మాటలునమ్మి మోసపోకుండా క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి భూములు కొనుగోలుచేసుకోవాలని ఎస్ఐ మహేష్ సూచించారు. శుక్రవారం ఎస్ఐ మహేష్ మాట్లాడుతూ మధ్య దళారులు కొందరు కొండగుట్టల మధ్య, లోయలో ఉన్న భూములను రోడ్డుపక్కన ఉన్నట్లు, రోడ్డుకు ఫస్ట్ బిట్‌లో ఉన్నట్లు మాయమాటలు చెబుతుంటారని, అందుకు కొనేవారు వారి మాటలునమ్మి దగాపడవద్దన్నారు. భూములుకొనేముందు క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రామస్థులకు వివరాలు తెలిపి భూములు కొనాలని, అలా కాకుండా మధ్యదళారుల మాటలునమ్మి తొందరపడి అగ్రిమెంట్ చేసుకుని కొంతనగదు చెల్లిస్తే భవిష్యత్తులో అవస్థలు పడాల్సి వస్తుందని ఎస్ఐ మహేష్ సూచించారు.

## పదవీవిరమణ క్రిందివారికి అనుభవాలు నేర్పడమే

-మండల తహసీల్దార్ పరమేశం



మండలవిద్యాధికారి రాంబాబును సన్మానిస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మండలం మున్సిపాలిటీ కేంద్రంలో మండల విద్యాధికారి దాస్యం రాంబాబు పదవీవిరమణ శుక్రవారం ఎంపిఆర్ఆర్ గార్డెన్‌లో అంగరంగ వైభవంగా విద్యావేత్తలు, నియోజకవర్గ మండలాల ఉపాధ్యాయులు మండల విద్యాధికారుల మధ్యలో జరిగింది. ఈకార్యక్రమానికి జిల్లాలోని ఆయామండలాల విద్యాధికారులు పాల్గొన్నారు. కార్యక్రమానికి గుమ్మడిదల మండల తహసీల్దార్ పరమేశం, కమిషనర్ దశరథం, మాజీజడ్పిటిసి కుమార్‌గౌడ్, మాజీ సర్పంచులు పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పరమేశం, మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి తనజీవితకాల ఉద్యోగంలో ఎక్కువగా సొంతవారితోకాకుండా సహ ఉద్యోగులతో ఎక్కువకాలం గడుపుతారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాజీసర్పంచులు మాజీ ఎంపిటిసిలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచాలి

-జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

**జగదేవ్‌పూర్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థులను తీర్చిదిద్ది ప్రభుత్వ విద్యావిధానంలో సిద్దిపేట జిల్లాను ప్రథమస్థానంలో ఉంచాలని జిల్లా విద్యాధికారి ఈ.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఎస్‌వి ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన మండలవిద్యాధికారి ముచ్చంతల మాధవ రెడ్డి పదవీవిరమణ అభినందనసభకు విచ్చేసి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఉపాధ్యాయుడు నిబద్ధతతో పనిచేయాలని, ప్రభుత్వ బడులలో విద్యనభ్యసించేవారు పేద విద్యార్థులు అని, వారికి నాణ్యమైనవిద్యనందించి ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. మండలంలో విద్యాధికారిగా ముచ్చంతల మాధవరెడ్డి చేసిన సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. విద్యాధికారిగా మండలంలో ప్రాథమిక పాఠశాలల అభివృద్ధికి నిరంతరం కృషి చేశారని, వృత్తిరీత్యా ఆయన అంకితభావంతో పని చేయడం వల్ల అందరి ప్రశంసలు అందుకున్నారని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నిర్మల, మండల అభివృద్ధి అధికారి రాంరెడ్డి, మాజీ కొండ పోచమ్మ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు న్యాలమడుగు హనుమంతరెడ్డి, ఎస్ఐ.కృష్ణారెడ్డి, కామారెడ్డి మాజీ అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జగదేవ్‌పూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సైదులు, ప్రధానోపాధ్యాయులు అనసూయ, కనకయ్య, ములుగు ఎంఈవో ఉదయభాస్కర్, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి శశిధర్‌శర్మ, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలీఅహ్మద్, యాదగిరి, టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.విజయేందర్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, టిఎస్‌జిహెచ్‌ఎంఏ జిల్లా అధ్యక్షుడు కరీమొద్దీన్, ఎల్ఎఫ్ఎల్ సంఘం అధ్యక్షుడు సత్యానంద్, ప్రధానకార్యదర్శి వెంకటయ్య, ఎస్‌జిటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, వివిధ సంఘాల మండల నాయకులు వెంకట్రాంరెడ్డి, బొద్దునాయక్, శ్రీనివాస్, పరశురాములు, సత్తయ్య, పోచయ్య, సత్యనారాయణ, శ్యాంసుందర్, వెంకటేశ్వర్లు, పృథ్వీ, శ్యామయ్య, కుటుంబసభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## స్వంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న దృశ్యం

**రామచంద్రాపురం, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని బిహెచ్ఈఎల్ పరిధిలోని ఓల్డ్ ఎంఐజి నుంచి కొత్త ఎంఐజికి వెళ్లేరోడ్డు పూర్తిగా గుంతలమయంకావడంతో ప్రజలు ప్రయాణానికి పాట్లు పడుతున్నట్లు తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ మల్లెపల్లి సోమిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు బాలాజీ (బాబ్జీ), లచ్చిరాంనాయక్‌లు తమ స్వంత నిధులతో రోడ్డు మరమ్మతులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. రోడ్డు మరమ్మతులతో విద్యుత్‌నగర్, తెల్లాపూర్‌లోని కాలనీల్లో నివాసం ఉంటున్న వాహనచోదకుల కష్టాలు కడతేరుతాయని చెప్పవచ్చు. రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న నాయకులకు ఆయా కాలనీవాసులు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న బిజెపి నాయకులు

**నారాయణఖేడ్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
బారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు నేడు నారాయణఖేడ్ పట్టణంలోని దుర్గాభవాని మందిరం మంగళపేటవద్ద బిజెపి నాయకులు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు రాజశేఖర్‌గౌడ్, బిజెవైఎం అసెంబ్లీ కన్వీనర్ పట్నం మాణిక్, సాయందర్, వెంకటరెడ్డి, మేకల జ్ఞానేశ్వర్, సగుణాకర్, ఏక్‌నాథ్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికల హాస్టల్లో.. బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు, ఉపాద్యాయుల దృశ్యం

**నారాయణఖేడ్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ పరిధిలోని జూకల్ శివారులోగల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శుక్రవారం స్పెషల్ ఆఫీసర్ సురేఖ, కృష్ణవేణిపాఠశాల ఉపాధ్యాయునులు, విద్యార్థులు, సిబ్బందితో కలసి బతుకమ్మ సంబరాలు జరిపారు. విద్యాశాఖ దసరాసెలవులు ప్రకటించడంతో రెండురోజుల ముందే పాఠశాలలో సంప్రదాయంప్రకారం బతుకమ్మసంబరాలను అంగరంగవైభవంగా జరిపారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ ఉపాధ్యాయులు, విద్యార్థులు బతుకమ్మపాటతోపాటు, కోలాటంవేసి అందరినీ ఆనంద పరిచారు. ఈసందర్భంగా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సురేఖ మాట్లాడుతూ ప్రకృతిని ప్రేరేపించే పండగ బతుకమ్మపండగ అని కొనియాడారు. తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. సంబరాల్లో పాల్గొన్నవారు స్వప్నరెడ్డి, ఉమారాణి, శశికళ, సుజాత, సుగుణ, ప్రవీణ, కవిత, విజయలక్ష్మి, సుమిత్ర, సుమలత, అనురాధ, ఉష, శ్వేత కౌసల్య, మేఘలత, జ్యోతి, పాఠశాల సిబ్బంది కళాబాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

## శానిటరీ సిబ్బందికి దసరా కానుక..

**నారాయణఖేడ్, సెప్టెంబరు, 19, ప్రభాతవార్త:**
లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణఖేడ్ వారి ఆధ్వర్యంలో చందాపూర్, అనంత సాగర్ గ్రామ పంచాయతీ శానిటరీ సిబ్బందికి, అంగన్‌వాడీ ఆయాకు దసరా కానుకగా న్యూ బాంబే కట్‌పీస్ సెంటర్ నారాయణఖేడ్ వారి సౌజన్యంతో దుస్తులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణఖేడ్ ప్రెసిడెంట్ సాయిసంగమేశ్వర్, జోన్ చైర్మన్ రాజ్ కుమార్, సభ్యులు పరమేశ్వర్, రాజేష్‌రెడ్డి, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హిందీ నేర్చుకుంటే దేశమంతా తిరగచ్చు

-హెచ్ఎం మహేశ్వర్




హిందీ దివస్ దృశ్యం


**పాపన్నపేట, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
హిందీభాష నేర్చుకుంటే దేశంలో ఏ మూలకైనా వెళ్లొచ్చని పాపన్నపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్ వెల్లడించారు. శుక్రవారం పాపన్నపేట హిందీ ఉపాధ్యాయులు నింగప్ప, రియాజ్ ఆధ్వర్యంలో హిందీ దివస్ నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఆటల, పాటల పోటీలతోపాటు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా మల్లంపేట గ్రామానికి చెందిన సాయినాథ్రావు ఉత్తమప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. ఇందులోభాగంగా హిందీ ఉపాధ్యాయులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజాగౌడ్, ప్రవీణ్, నాగరాజు, యాదయ్య, వేణుగోపాల్‌రెడ్డి, మోహన్‌రావు, కృష్ణకాంత్, నర్సింలు, శ్రీహరి, రవికాంత్, పిడి రమేష్, సుభాష్, విశ్వనాథ్, జాకీర, పద్మలక్ష్మి ృ, రజిత, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## రాయిపల్లి విద్యార్థులకు సైబర్‌నేరాలపై అవగాహన

**మనూర్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని రాయిపల్లిగ్రామంలోని ఉన్నతపాఠశాలలో విద్యను ఆర్జిస్తున్న విద్యార్థులకు, వైటిసి సెంటర్‌లోని విద్యార్థులకు శుక్రవారం షీ-టీం, యూత్ ఫర్ హ్యుమానిటీ ఆధ్వర్యంలో మహిళల భద్రత, సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. మహిళలు దూర ప్రయాణాలు చేసే తరుణంలో, ఒంటరిగా ప్రయాణంచేస్తున్న సమయాల్లో టీసేఫ్ యాప్‌ను ఉపయోగించాలని సూచించారు. ఇబ్బందులకు గురైతే వెంటనే 100కు, మహిళల భద్రత కొరకు 1098కు చిల్డ్రన్ హెల్ప్ లైన్ 181లలో ఏదైనా నంబరుకు కాల్‌చేయాలని సూచించారు. కార్యక్రమంలో యూత్ ఫర్ హ్యుమాటీని ఉపాధ్యక్షులు అమీర్, సభ్యులు అమెర్, అసద్, జహీర్, షీ-టీం ఎఎస్ఐ తులసీరాం, చాంగుబాయి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నల్లకుంటలో ఎర్రటి నీళ్లు

-నల్లకుంట చెరువు నుంచి ఎర్రని కాలుష్య జలాలతో పొంగిపొర్లుతున్న అలుగు
పంటపొలాల్లోకి చేరిన ఎర్రని రంగు కలిగిన వ్యర్థజాలాలు



వ్యవసాయ పొలంలో చేరిన ఎర్రటి వ్యర్థజలాల దృశ్యం

**గుమ్మడిదల, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు వార్డులోగల నల్లకుంటలోని నీళ్ల గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి పై పరిశ్రమల నుంచి కాలుష్య వ్యర్థజలాలు రావడంతో కుంటలోని నీరు ఎర్రటి రంగుగా మారి వ్యవసాయానికి వాడుకునే నీరు కాలుష్య వ్యర్థ జలాలతో కలుషితం అయ్యాయని దోమడుగు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ పైభాగంలో ఉన్న భారీ పరిశ్రమకు చెందిన కాలుష్య జలాలు వర్షం మాటున వదలడంతో కింది భాగంలో ఉన్న నల్లకుంటలో చేరి పూర్తిగా ఎర్ర రంగుగా మారి కాలుష్యంతో నిండిపోయాయని అన్నారు. కుంట క్రింది భాగంలో ఉన్న పంట పొలాల్లోకి ఆ నీరు రావడంతో పంటలు పూర్తిగా తీవ్రనష్టాన్ని కలిగిస్తున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 16 ఏళ్ల నుంచి ఇదే తంతుగా కొనసాగుతున్నా. పిసిబి అధికారులు, పరిశ్రమ యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, అధికారులు పరిశ్రమల వారికి తొత్తులుగా మారడం వ్యవసాయంపై ఆధారపడి ఉన్న రైతుల నోట్లో మట్టికొడుతున్నారని చెరువు కింది రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు పూర్తివిచారణ జరిపి చర్యలు తీసుకోవాలని దోమడుగు రైతులు మద్ది జైపాల్‌రెడ్డి, మంగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు కోరుతున్నారు.

## విద్యాభివృద్ధికి రోటరీ క్లబ్ కృషి

-మండల విద్యాధికారి శంకర్

**పుల్‌కల్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
విద్యాభివృద్ధికి సంగారెడ్డి మంజీరా రోటరీ క్లబ్ వారు అందచేస్తున్న సహకారం అభినందనీయమని మండల విద్యాధికారి శంకర్ అన్నారు. శుక్రవారం మండలపరిధిలోని గొంగ్లూర్ తండాలోని పాఠశాలలో విద్య అందుకుంటున్న విద్యార్థులకు మంజీరా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ సభ్యులు, దాత కమలాకర్ రాజు 30వేల రూపాయల విలువగల బ్యాగులు, ప్లేట్లు, గ్లాసులు, వ్రాత సామగ్రి, మైక్ సెట్‌ను అందచేశారు. ప్రపంచవ్యాప్తంగా పోలియోలేకుండా రోటరీ ఇంటర్నేషనల్ కృషిచేస్తోందని మంజీర రోటరీ క్లబ్ అధ్యక్షులు కిషన్ వివరించారు. సమాజానికి కొంతైనా అందించేందుకు పే బ్యాక్ టు సొసైటీ అని విశ్రాంత మండల విద్యాధికారి, న్యాయవాది, రోటరీ క్లబ్‌సభ్యులు డి.అంజయ్య సూచించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్‌సభ్యులు దినేష్, గొంగ్లూర్ తండా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్, శివంపేట కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేదశ్రీ, సిఆర్‌పిలు వినయ్, ప్రభాకర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రేణుక, విఏఓ, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం

-కాంగ్రెస్‌పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గం ఇంచార్జ్ కాట శ్రీనివాస్‌గౌడ్

**అమీన్‌పూర్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
పేదల ఆరోగ్య సమస్యల పరిష్కారంలో ముఖ్యమంత్రి సహాయనిధి నిజమైన సంజీవనిగామారిందని పటాన్‌చెరునియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన నివాసంలో 11మంది లబ్ధిదారులకు రూ.5,79,500/- విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యంకాపాడటం, పేదలకు ఆర్థికభరోసా కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష ్యమన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు సిఎం సహాయనిధి నిజమైన వరప్రసాదం. ఇప్పటివరకు వందలాది కుటుంబాలు ఈపథకం ద్వారా లబ్ధిపొందాయన్నారు. అనంతరం చెక్కులు అందుకున్న లబ్దిదారులు ఆనందం వ్యక్తంచేస్తూ ఈ ఆర్థికసహాయం మాకుటుంబానికి పెద్ద ఊరటను ఇచ్చిందని, చికిత్స ఖర్చులభారాన్ని తగ్గించినందుకు కాటా శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లాస్థాయి పోటీల్లో ఆశ్రమపాఠశాల విద్యార్థుల ప్రతిభ



ఎస్‌జిఎఫ్ క్రీడల్లో విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భవాని

**చౌటకూరు, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
జిల్లాస్థాయి ఎస్‌జిఎఫ్‌గేమ్స్‌లో మండలపరిధిలోని బొమ్మారెడ్డిగూడెం టిడబ్ల్యు ఆశ్రమపాఠశాల విద్యార్థులు కబడ్డీపోటీలో సత్తాచాటి విజయం అందుకున్నారు. జహీరాబాద్ పట్టణశివారులోని రంజోల్‌లోని పాలిటెక్నిక్ ఆవరణలో కొనసాగుతున్న జిల్లాస్థాయి అండర్-14 కబడ్డీ పోటీల్లో విద్యార్థులు ప్రతిభచాటి మొదటిస్థానాన్ని కైవసం చేసుకోగా క్రీడాకారులను జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్‌శెట్కార్ ప్రత్యేకంగా అభినందించి బహుమతులు అందచేశారు. మొదటిస్థానంలో నిలిచిన విద్యార్థులను పిఈటి సోనేష్, వసతిగృహం మేట్రిన్ భవాని, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

## మాజీ సర్పంచ్‌ను సన్మానించిన నరోత్తం



బక్కన్నను సన్మానిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం

**జహీరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్ పార్టీలో చేరిన ఝరాసంగం మండలం జొన్నగామ మాజీ సర్పంచ్ బి.బక్కన్నను శుక్రవారం ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం శాలువాకప్పి సన్మానించారు. ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన బక్కన్న మర్యాదపూర్వకంగా నరోత్తంను కలుసుకోగా, నరోత్తం సాదరంగా స్వాగతంపలికి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బి.క్రిష్ణ, నాయకులు వీరన్నపాటిల్, శివన్నపాటిల్, మల్లికార్జున్‌పాటిల్, రాజేశ్వర్ పాటిల్, నరేష్‌గౌడ్, ఎన్.సంగమేశ్వర్, బి.నర్సింలు, సి.సంగారెడ్డి, ఎన్.దత్తు, యం.అంజన్న, యం.రాములు తదితరులు పాల్గొన్నారు.

## రికార్డులు తనిఖీచేసిన డిఎల్‌పిఓ



మాట్లాడుతున్న డిఎల్‌పిఓ సాయిబాబా

**చిలిపిచెడ్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
మండలంలోని ఫైజాబాద్, అజ్జమర్రి గ్రామపంచాయతీల రికార్డులను శుక్రవారం డిఎల్‌పిఓ సాయిబాబాతనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన పంచాయతీ కార్యదర్శిలతో మాట్లాడుతూ, ప్రజలకు సీజనల్ వ్యాధులు రాకుండా అవగాహన సూచనలుచేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్ల అరెస్టు




పోలీస్‌స్టేషన్‌లో అంగన్‌వాడీ టీచర్లు

**చిలిపిచెడ్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
తమ సమస్యల పరిష్కారం కోసం చిలిపిచెడ్ మండలంలో ధర్నాకు పిలుపునివ్వడంతో అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు అరెస్టు చేశారు. పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, నూతన విద్యావిధానంలో ప్రీ ప్రైమరీ అంగన్‌వాడీ సెంటర్లను నియమించాలనే డిమాండ్లతో అంగన్‌వాడీలు ధర్నాకు పిలుపునిచ్చారు.